
# బలివాడ కాంతారావు

# పెళ్ళి పందాలు




పెద్దకూతురు విజయ, డాక్టరయితే యింట్లో రోగాలకి ఆదుకుంటుందనీ, తన మొగుడ్ని తను తెచ్చుకుంటుంది అనుకుంటే మెడిసిన్లో సీటు రాలేదు. అంచేత విజయ బి.ఎస్సి. రెండో యేట వుండగానే వీరయ్య వరాన్వేషణలో పడ్డాడు.

హమ్మయ్యా! విజయ ఎమెస్సీలో వుండగా వరుడు కుదిరాడు. "అంత హైరానపడిపోయారు. దేనికైనా ఆరోజు రావాలన్నాను కదా – అంతా ఆ వెంకటేశ్వర స్వామి కరుణ" అంటె భార్య భాగ్యలక్ష్మి.

వీరయ్య వరాన్వేషణ స యంగా చేసాడు. జాతకాలు పడ్డాక, అమ్మాయి కలర్ ఫోటోలు రెండు – అందులో ఒకటి ఫుల్ సైజు చూపించాడు. ముందుగా కాబోయే వియ్యంకుడితో గుప్తంగా మాటాడుకున్నారు. అంతా పకడ్బందీగా, తగిన కట్టుదిట్టాలన్నీ త్వరత్వరగా చేసాక గానీ పెళ్ళి చూపులకు గడపయెక్కించలేదు.

అబ్బాయి అమ్మాయినేవో ప్రశ్నలు వేసాడు. తెలివైన ప్రశ్నలకు అమ్మాయి సమాధానాలు చెప్పలేక పోయిందని అనుకున్న భాగ్యలక్ష్మి 'దానికి వల్లమాలిన సిగ్గుబాబూ – తూచిమాటాడుతుంది' అని సర్ది చెప్పింది. అబ్బాయికి అమ్మాయి నచ్చింది. అమ్మాయికి అబ్బాయి నచ్చాడా అని యెవరూ అడగలేదు.

ఇక విజయ ప్రమేయం లేకుండా మిగతా విషయాలు పెద్దలు మాటాడుకుని, సంబంధం రైటు చేసుకున్నారు.

"అతనితో రెండు అబద్ధాలు యెందుకాడావ్?" అని కూతురు తల్లిని నిలదీసి అడిగింది.

"అబద్ధాలాడి నీకు తెచ్చిన చింత యేంటో చెప్పే?" ఈసడించింది తల్లి.

"అసలు అతను వేసినవి చచ్చు ప్రశ్నలని తెలుసా?"

"తెలుసుకోడానికి అంత చదువు చదువుకోలేదుగా – నీవు కనీసం కాబోయే వాడ్ని చూసావే. నేను పెళ్లిపీటల మీదైనా సరిగ్గా చూసానా? ఒక బిడ్డ తల్లి అయ్యేవరకు పగలు అతని ముఖం యెలా వుండేదో యెరుగుదునా?"

"ఇంత చదివీ నన్నూ అలాగే వుండమంటావా?"

"ఇత్తడి పళ్లెం నేనైతే – నీవు స్టీలు పళ్లేంవి. గోడ చెరుపులా మొగాడి అండలేకపోతే యీ ఆడజాతి యెందుకూ పనికిరాదే!"

"ఆ గోడ కన్నాల్లో పాములున్నా...?"

"ఏంటా తలతిరుగుడు మాటలు? రాళ్లెత్తమంటున్నామా? రప్పలెత్తమంటున్నామా? బంగారం లాంటి సంబంధం తెస్తే యీ యీతి పంపు మాటలేమిటే?"

"ఇంతకీ నాకు నచ్చాడో లేదో తెలుసుకోకుండా మాటిచ్చారా?"

"నచ్చకేమౌతాడే? వాళ్ల వంశం యేంటనుకుంటున్నావ్? అబ్బాయి తండ్రికి ఒక్కడేనా? నీ మొగుడు - నా అల్లుడు సెంట్రల్ గవర్నమెంటులో ఆఫీసరే! ఏ ఆడబడుచుల గోలలేదు. అత్తగారా? గోవు లాంటి మనిషి చూసావుగా - ఎంత నెమ్మదిగా సర్దుకుంటూ పోయిందో? ఆ కట్టుకున్న మొగుడు పెట్టుకున్న నగలిస్తాడు. ఇంతకన్నా యింకేం అదృష్టం వెతుకుతున్నావే?"

"దస్గలా ఆగకుండా వాగుతాను! పిగ్గంటూ యెరగను. అబద్ధాలాడి యీ పెళ్లి చేసాం అనుకోరా?"

"అదంతా నీకెందుకు? చెప్పినట్లు విను"

"అయితే నా పెళ్లి విషయంలో నాకు చెప్పే హక్కేం లేదన్నమాట'

"ఒక్కదానివై యుంటే నీ మాట విచేవాళ్ళమేమో గానీ... నీ వెనుకమరో యిద్దరున్నారు! నిన్ను చూసి వాళ్ళూ అడ్డదిడ్డంగా, మర్యాదా మంచీ లేక వాగితే... ఇక మా పాట్లు చెప్పకేం?"

"నువ్వన్న ఆ గోవు యేదో షరతు పెట్టిందని విన్నాను"

"నీతో యెవరు చెప్పారే!"

"పెట్టారాలేదా?"

"పెళ్లికుదిరిందెప్పుడో! వాళ్ల యిష్టా యిష్టాలుగానీ - మావేం వుంటాయ్?"

"కనీసం నా యిష్టం అంటూ ఒకటి వుందా?"

"నేరక చదువులో నిన్ను వేసాం"

"నయం! నేరక నిన్ను కన్నాననలేదు"

"కన్న తల్లితో కూతురు అనవలసిన మాటలేనా యివి? మరెందుకు? అది కూడా అనేసి" "ఏది?"

"ఒక్క కూతురుతో చాలించక మరిద్దరు కూతుర్లనెందుకు కన్నావ్ అని"

"వాళ్లు పెళ్లయ్యాక మధ్యలో చదువు ఆపేయండి అనటం - మీరు నన్ను అడక్కుండా ఒప్పుకోవటం బాగుందా చెప్పు?"

"ఇందులో బాగు ఓగుకు యేం వుందీ? ఉద్యోగం చేసే అవసరం వున్న యింట్లో వేస్తున్నామా? మీ అన్నయ్య కూతురు శైలజ, ఎంబీబియస్ మూడో యేట మానేసి మొగుడు వెంట వెళ్లిపోలేదూ? ఆ డాక్టరు చదువు కన్నా నీ చదువు గొప్పదా?"

"ఎవరి చదువు వాళ్లకు గొప్పది. ఎవరి నిర్ణయం వారికి సరైనది. నా తెలివితేటలతో నిర్ణయం తీసుకునే అవకాశం మీరివ్వటం లేదు. నలుగుర్ని ఆదేశించే బాధ్యతగల ఉద్యోగంలో వున్నా, అన్యాయమైనా అతను తల్లి కోర్కెను కాదనలేక పోయాడు. ముందుకు సాగబోయే నా పిల్లలను మాత్రం మీలాగ బందీలను చెయ్యను"

ఎలానూ యీ వాదన అంతానికి వచ్చేసమయమే. ఇంతలో కాబోయే అల్లుడు మురళి వచ్చాడు. భాగ్యలక్ష్మి యెంత సంబరపడిందో? కూతుర్ని పిల్చి కూర్చో పెట్టింది. "పెద్దల్లుడివి - మంచీ చెడూ మాటాడి సలహా తీసుకోడానికి అబ్బాయి చిన్నవాడు. నీవు తప్పయింకెవరూ ఆయనకు దగ్గర వాళ్లు లేరు నాయనా?"

"మామయ్యగారికి చెప్పగలిగే తాహతు మాకెక్కడ వుంది అత్తయ్యగారూ? ఫోటో చూడగానే మా ఆవిడ యిదే అని నాన్నగారితో చెప్పేశాను. నీ యిష్టమే మా యిష్టం అనేశారు."

బిస్కట్లు తిని బోర్నవిటా తాగి మురళి విజయ వేపు ఒక నవ్వు పారేసి వెళ్లిపోయాడు. వారు వెళ్లాక "మొగపిల్లడైనా ఆ వినయం చూడే. ఎక్కడ అలాంటి అన్ని హంగులున్న మొగుడు దొరుకుతాడే నీకు?"

"వెతక మంటావా?"

"ఆ మొండి వాదన చాలించి తలవంచుకుని పుస్తె కట్టించుకో"

"పెళ్ళి కింకా రెండు నెలలుంది కదా -- మీరు తెచ్చిన పతి, దేవుడుగా మెసలుతాడో? దెయ్యమై వేధించుకు తింటాడో?"

"దేముడవ్వనీ దెయ్యమవ్వనీ ... పెళ్లాడవలసిందే... ఇది తప్పితే యీ జన్మకి నీకు మొగుడు రాడు!"

తరువాత వారం రోజులకి యింట్లో ఫోను మ్రోగింది. ఎత్తింది విజయ చివరి మాటలు విన్న తల్లి "ఎవరే? అల్లుడేనా?" అంది.

> **కథలు వ్రాయడం ఎలా?**
>
> * కథా రచయితకి నా సలహా,
>
> ఏదో ఓ కాయితం, ఏదో ఓ పాళకలం చేత పట్టుకుని కూచో. ఏదన్నా కథ వొచ్చిందా రాయి. రాలేదా కాయితం చించేసి రాజకీయ నాయకుడి వయ్యే ప్రయత్నం చేసుకో.
>
> కథ వొచ్చిందా, కాపీలు తీసి పత్రికలకి పంపు. వాళ్లు అచ్చు వెయ్యలేదా, వాటినో కవరులో పెట్టి ముందు తరాల వారి కోసం దాచెయ్యి.
>
> - చలం.
>
> శార్వరి సంకలనం నుంచి


"మరి సర్కారు వారి యింట్లో ఫోనుయెందుకిచ్చారు?"


"అడ్డదిడ్డం వాగుడు మాని అల్లుడు సాయంకాలం వస్తున్నాడని చెప్పాడా?"

"ఐ లవ్యూ వెరీమచ్ అన్నాడు"

"అల్లుడు గారికి తొందరైపోతోంది. మధ్యన ఈశూన్యమాసాలు వచ్చాయిగానీ యీ సరికి యే కాశ్మీరో యెక్కడో వుండేవారు కదా..." ఫోన్లో మాట్లాడిన అసలు విషయం నెమ్మదిగా చెప్పింది. కూతురు వెళ్లే వరకు యేవేవో ఆదేశాలు యిస్తూనే వుంది.

సాయంత్రం ఊరు మధ్యలో వున్న పార్కు. విజయ ఆ పార్కులో గుప్తంగా మాట్లాడుకోవడానికి సరైన స్థలంలో ఒక పొదచాటున కూర్చుంది. అనుకున్న సమయానికి మురళి వచ్చాడు. ప్రక్కన దగ్గరగా కూర్చోబోతే కాస్త ప్రక్కకు






జరిగింది.

"ఏం? ఇంకా యెందుకీ ఆంక్షలు?"

"మూడు ముళ్లు పడే వరకూ మా అమ్మ మిమ్మల్ని తాకవద్దంది. మీ స్కూటారు సైకిలు వెనుక కూర్చోవద్దంది. సినిమాకి పిల్చినా వెళ్లవద్దంది. చూసారా మా అమ్మకు మనిద్దరి మనో నిబ్బరం మీద యెంత నమ్మకం లేకుండా పోయిందో?"

"అమ్మమీద చెప్పావు. నాన్నమీద చెప్పడానికేమైనావుంటే చెప్పు" అన్నాడు నవ్వుతూ.

"బాగా గుర్తు చేసారు. మా గురించి సరిగ్గా మీరేం తెలుసుకోకుండానే సంబంధం రెటు చేసుకున్నట్లుంది. మా నాన్న జీతపురాళ్ల మీదే బతికుంటే ముప్పయి యైదేళ్ళ సర్వీసు తర్వాత ఒక రెండు లక్షలు వరకు ప్రావిడెంటు ఫండు గ్రాట్యుయిటి. కమ్యుటేషను వచ్చేది. అదంతా ఒక్క కూతురు పెళ్లికే సరిపోయేది? రిటైరయ్యేసరికి అద్దె యింట్లో వుండ వలసి వచ్చేది. అందుకు అతను ముందుగానే మేల్కొని యేంచేసాడో తెలుసా? దలారుల ద్వారా దోచాడు. అందుకే అతను దొరికి పోలేదు. ఆ దోపిడి దోచిన వాళ్ల దగ్గిర చేస్తే బాగుండేది. చట్టబద్దంగా న్యాయంగా బతికే వాళ్ల దగ్గర నించి కూడా పిండేసాడు. తిండికా? కాదు. మా నాన్న పంచదార రుచి మరచి యేన్నాళ్లో అయ్యింది. మేడ కట్టించడానికి. ముగ్గురు కూతుళ్ళ పెళ్లిళ్ళు ఘనంగా చెయ్యడానికి ఇంత పని చేసారు. అతనికి చెయ్యాలని లేదనుకోండి -- మరి తప్పింది కాదు... మా విషయం చెప్పాను. మీ విషయాలేమైనా చెప్తారా?"

"ఎలాగో కలిసాం. ఇప్పుడు ఆ అనవసర ప్రసంగం యెందుకు?" మురళి నవ్వుతూ అన్నాడు.

"అనవసరం అంటారేంటి? మీ తాతయ్య వీర్రాజుగారు పులి చంపిన వీరుడటగా....."

"అవును ... ఆ పులి గోళ్లే నా పతకంలో వున్నది?"

"మరి తుపాకి లేకుండా పులి కెదురెల్లి ఉత్తి చేతులతో పోరాడబట్టి అతనికి పులిరాజనే పేరొచ్చిందటగా"

"మేకను ఎదురుగా పెట్టి, చెట్టెక్కి చాటుగా తుపాకితోనే కాల్చాడు. అది అసలు సంగతి".

"రెండు ప్రాణాలు బలైతే గాని అతనికా బిరుదు రాలేదన్నమాట" అంది నవ్వుతూ విజయ.

"ఇక్కడ జనం పెరుగుతున్నారు. బీచిలోని తారకరామ పార్కుకి కాస్సేపు పోయి మాటాడుకుందాం పద..." అన్నాడు.

"మా అమ్మకు తెలిస్తే-"

"ఫరవాలేదు. నేను సంజాయిషీ చెప్పుకుంటానులే."

"అన్నట్లు మరచాను. అదిగో... ఎదరగా... అటువేపు నా క్లాసుమేటు ఒక అమ్మాయి వుంది. మీకు తెచ్చి చూపిస్తానని మాట ఇచ్చాను. అయిదు నిముషాలే... లేవండి... నడిచే పోవచ్చు.." అంటూ విజయ లేచి పోయింది.

ఆ ఇంట్లో కాలు పెట్టొండగానే మురళి వయస్సు వాడే ఒకడు బయటకు వస్తున్నాడు. చేతిలో బిల్డింగు డ్రాయింగ్స్ వున్నాయ్. చిన్న నవ్వుతో వెళ్లిపోయాడు. విజయ ఆగి "అతను శ్రీరాం... మా స్నేహితురాలి అన్నయ్య పోర్టులో సివిల్ ఇంజనీరు మంచి ఆర్కిటెక్ట్ కూడాను. రాత్రి పన్నెండు వరకు పనిచేసి బయట కూడా సంపాదిస్తున్నాడట."

అతను అలా రొప్పుకుని వెళ్లిపోవటం మురళికి నచ్చనట్లు ముఖం పెట్టాడు. ఇంట్లోకి వెళ్లగానే నిర్మల నవ్వుతో ప్రత్యక్షం. "అమ్మా నాన్నా ఉదయమే రాజమండ్రి వెళ్లారు. కూర్చోండి".

"మరి కూర్చోడానికి టైము లేదు. ఒకసారి హలో అని వెళ్లిపోదామని వచ్చాం" అంది విజయ.

"ఇద్దరూ కలిసి వచ్చారు. కాఫీ అయినా తాగకుండా వెళ్లిపోతారా?"


. "ఇంకోసారి వస్తాంలేవే" అంటూ విజయ కదలగానే వెంట మురళి పడ్డాడు. తారకరామా పార్కు గురించి మరచి పోయినట్టున్నారు. ముభావంగా వున్నాడు మురళి. మళ్ళీ అదేస్థలంలో కూర్చున్నారు. ఈసారి విజయ మురళి కెదురుగా కూర్చుంది. అతను తలవంచి వుంటే "ఏం అలా తలదించేసారు? ఆ అమ్మాయి

కథలు వ్రాయడం ఎలా?

ప్రతి వ్యక్తి వితంలోనూ, వొక నవలకి తగ్గ వొస్తు వుంటుందంటారు. దీని మాట ఎట్లా వున్నా ప్రతి వ్యక్తి జీవితం లోనూ వొక కథకి తగ్గ వస్తువు ఉండి తీరుతుందనడంలో సందేహం లేదు..... కథలో ఇతి వృత్తానికి అనువైన శైలిని అలవరుచుకోవాలి కథకుడు; కృషి చేసి దాన్ని సాధించాలి. అల్లా ఏర్పడ్డ శైలి, రచయిత వ్యక్తిత్వంపైన ఆధారపడుతుంది. అతను చదివిన రచయితల శైలిపైన కూడా కొంతవరకూ ఆధారపడుతుంది. అతని వెనక వున్న సమాజం, నాగరికత, వాటి శైలి, ప్రతి ధ్వనులు వినబడుతుంటాయి. నాకు రెండు కావాలి. నేను చెప్పేది నాకు నచ్చాలి - అందంగా, శక్తి వంతంగా స్పష్టంగా కనబడాలి.

-బుచ్చిబాబు.

శార్వరి సంకలనం నుంచి




మీ కళ్ళకి కట్తోందా?"

జవాబు లేదు.

"నాకంటే చాలా అందంగా వుంది కదూ?"

దీనికీ జవాబు లేదు.

"మంచి పిల్ల – నాకంటె తెలివైన పిల్ల. క్లాసుకి ఫస్టు వస్తుంటుంది. ఏ గాడు అదృష్టం చేసి పుట్టాలి. నిర్మల తండ్రికి ఒక్కర్తె కూతురు. శ్రీరాం ఒక్కడే కొడుకు."

అప్పటికీ తలెత్తక పోతే "ఏం అలా ఒక్కసారి మారిపోయారు?' అంది.

"ఏం మారలేదు!" అన్నాడు విసుగ్గా.

"ఇదివరకీ అమ్మాయిని చూసారా?"

"లేదు"

"ఆ అమ్మాయి ఫోటోగానీ యెక్కడైనా చూశారా?"

దానికి తలైనా ఆడించలేదు.

"ఏమండీ? మీ మెడలో పతకం కనపడలేదేం?"

"ఉంది"

"ఏదీ?" మెల్లగా టీషర్టు లోపలనించి బయటకు తీసాడు.

"మరి ఆ పతకానికి తగిలించిన బిళ్లయేదీ?"

"ఏం బిళ్ల?"

"పెళ్లి చూపులకు వచ్చాం – ఆరోజు చూసానండి"

"అబద్ధాలెప్పుడు నేర్చారు?"

"నిజం దానిమీద లక్ష" అని రాసుంది!".

మురళి తీక్షణంగా చూసినా విజయ నవ్వుతూ "బేరం అయిపోతుందని ఆ విలువ బిళ్ల తీసేసి వుంటారు.

"నోటి కొచ్చినట్లు వాగుతున్నావ్?" కోపంగానే అన్నాడు.

"కోపగించుకోకుండా ఒక ప్రశ్నకు జవాబు చెప్తారా? వాళ్లయింటికి ఫలానా తేదీ వాడు తప్పక పెళ్లి చూపుల కొస్తామని చెప్పి అంతకు ముందుగా మా యింటికి వచ్చేసి అంత వున్నతమైన మనుషుల్ని అవమానం యెందుకు చేసారండి? మీ చదువూ హోదా మీకు ఒక సంస్కారం అంటూ యిస్తే ఆలోచించి చెప్పండి. తొందరలేదు" అన్నాక కాస్సేపు ఆగి "ఇంకా ఆ కుటుంబం గురించి వినండి. నిర్మల నాన్నగారు జీతపురాళ్లు తప్ప, యింకొకరి సొత్తు ముట్టుకోలేదు. శ్రీరాంకి రెండు లక్షలిస్తామన్నారు. అందులో ఒక లక్ష నిర్మలకు కట్టుకున్న వాడి ముఖాన కొట్టగలరు. కానీ ఆ పని యింట్లో యెవరికీ యిష్టం లేదు. శ్రీరాం తను అహో రాత్రులూ కష్టపడి ఆర్జించిన దానితో చెల్లెలి పెళ్లి చేస్తానని భీష్మించుకున్నాడు.

విజయ అలా కాస్సేపు ఆకాశం వేపు వర్షించని మేఘాల వేపు, కదిలే పిట్టల వేపు చూస్తుంటే "తప్పునాదా? ఇటు వేపు రాకుండా మీ నాన్న డబ్బుసంచి చూపించి మీ ఇంటికి యెత్తుకు పోయాడు." అన్నాడు మురళి విసుగ్గా.

"మరి మీనాన్నో? ఇంత చదువు చదివి చేతకాని వాళ్లలా మనం ఒకర్ని యెందుకు నిందించాలి? మన బలహీనతలకు మనమే బాధ్యత వహించి తీరాలి. ఇప్పుడు నేనొకటి చెప్పదలిచాను". చెప్పు.

"నా ఇష్టం అంటూ తెలుసుకోకుండ మన పెళ్లికి మా వాళ్లు ఒప్పుకున్నారు. మీరు పెట్టిన షరతులేవీ నాతో చెప్పలేదు ఒక మర్యాదగా బ్రతుకుతున్న కుటుంబాన్ని నవ్వుల పాలు చేసిన మీరు, నన్నూ మా వాళ్లను మీ దురాశలతో నలిపి వేస్తారని నా అంచనా. ఈ పెళ్లి నాకిష్టం లేదు."

మురళి లేచి పోబోతుంటే "ఆగండి. అసలు విషయం చెప్ప నివ్వండి. అతను తలెత్తి "చెప్పు" అన్నట్లు చూసాడు.

"తీసేసిన 'లక్ష' బోర్డును మళ్లీ తగిలించకండి. నిర్మల దగ్గరికి వెళ్లండి. క్షమాపణ కోరుకోండి. అప్పుడు మీ సంస్కారాన్ని గౌరవించే ఆస్కారం వుంది."

"మరి నీ బ్రతుకో?"

"నేనా? శ్రీరాం లాంటి వాడు దొరికే వరకు వేచి వుంటాను."

"అలాంటి వాడు దొరక్కపోతే?"

"ఎన్నాళ్లైనా ఎదురు చూస్తాను. ఎదురు చూడటంలో యెంత హాయివుందో మీకేం తెలుసు?" అంటూ యీ పెళ్లిళ్ల పందెంలో గెలిచినట్టు గెంతుకుంటూ చక చకా వెళ్లిపోయింది విజయ. ●

నేనెందుకు రాస్తున్నాను?

* నేను చేసిన రచనలు ఇతరులమీద ఏ ప్రభావము చూపినా, చూపక పోయినా అవి వ్రాయడానికి నేను చేసిన ఆలోచనలవల్ల నేను మారాననడానికి నిదర్శనాలున్నాయి.

నాకు యిష్టమయిన కథలు వేరు. నాకు వ్రాయడం చేతనైన కథలు వేరు. నాకిష్టమైన కథలు ఎలా వ్రాయడమో నాకు తెలియదు. నాకు చేతనయిన కథలు వ్రాసి ప్రయోజనం లేదని తెలియసాగింది.

– కాళీపట్నం రామారావు (నవంబరు 1967)



భరాగో-అత్తలూరి సంకలనం నుంచి